
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.8 | కనిష్ఠం 16.7
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
శనివారం 9 నవంబరు 2024



రగ్బీ పోటీలకు అర్లి(టీ) విద్యార్థుల ఎంపిక

భీంపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అర్లి(టీ) జడ్పీ హెచ్ఎస్ విద్యార్థులు 68వ రాష్ట్రస్థాయి ఫెడరేషన్‌లో భాగంగా విద్యాశాఖ నిర్వహించిన రగ్బీ ఆటలో ధనూష్, దుర్గాప్రసాద్‌లు అండర్ -17ఎస్‌లో ఆదిలాబాద్ జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఈనెల 10, 11, 12వ తేదీలలో ఎన్‌టీఆర్, కేసీఆర్ వెంచర్ మేడ్చల్‌లో నిర్వహించే ఆటల్లో పాల్గొంటారు. వీరిని ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, శ్రీకాంత్, మహేష్, విజయలక్ష్మి, సాయికుమార్, బలరాం గ్రామస్తులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్

ఉట్నూర్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మబొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని లక్కారం హనుమాన్ మందిరం నుంచి ప్రారంభమైన పండరీపూర్ భక్తులు చేపట్టిన పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విఠల్ రుక్మిణి దేవతలను దర్శించుకుని, పల్లకినిమోసి, ఊరేగింపుగా వెళ్లి భక్తులకు సాగనంపారు. ఆయన మాట్లాడుతూ ప్రతియేటా కార్తికమాసాన్ని పురస్కరించుకుని భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో పాదయాత్రచేపట్టి మహారాష్ట్రలోని పండరిపూర్ విఠల్ రుక్మాయిని దర్శించుకుంటున్నారని అన్నారు. ఆధ్యాత్మికతతోనే మనసుకు ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మికత చింతనను అలవర్చుకోవాలన్నారు. భారతదేశం భిన్న సంస్కృతి - సాంప్రదాయాలకు నిలయమని పేర్కొన్నారు. సంస్కృతి సాంప్రదాయాలనుభావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని అన్నారు. ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని దేవుడిని వేడుకున్నారు. కార్యక్రమంలో తుకారం మహారాజ్, గిత్తే మారుతి మహారాజ్, విఠల్ మహారాజ్, భక్తులు, సాడిగే రాజ్ గోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా పండర్‌పూర్ భక్తుల పాదయాత్ర ప్రతి ఒక్కరికి ఆదర్శమని మాజీ జడ్పీ ఛైర్మన్ రాథోడ్‌జనార్ధన్ అన్నారు. ప్రతియేటా కార్తిక మాసంలో ఆడేతుకారం మహా రాజ్ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ నుంచి ప్రారంభమయ్యే విఠల్ రుక్మాయి పండర్‌పూర్‌యాత్రను శుక్రవారం ఉట్నూర్ చేరుకోగా ఉట్నూర్ ఎన్టీఆర్‌చౌక్ దగ్గర పలకీ వద్ద పూజలు చేసి మాజీ జడ్పీఛైర్మన్ పల్లకి మోశారు. అనంతరం తన స్వగృహంలోకి పండర్‌పూర్ భక్తులను తీసుకొచ్చి భక్తులతో కలిసి భజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కొమ్మురాంచందర్, ఆడే తుకారం, కొండారి రమేష్, జాదవ్‌రవి, మరోతి మహారాజ్ యువకులు తదితరులు పాల్గొన్నారు.


పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్

దళారీ దందా!



■ జిల్లాలోని ఏజెన్సీ గ్రామాల్లో అడ్డగోలుగా పత్తి కొనుగోళ్లు
■ తూకం, తేమ పేరితో ధరలు కోతలు పెడుతూ దళారుల మోసం
■ నడి రోడ్డుపై కొనుగోళ్లు చేస్తూ నిలువు దోపిడీ
■ మామూళ్ల మత్తులోనే మార్కెటింగ్ శాఖాధికారులు


సిరికొండలో రోడ్డు పైనే పత్తి ముల్లెలను కొంటున్న దళారులు

ఆదిలాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలో కొందరు దళారులు దోపిడీ దందాకు తెరలేపుతున్నారు. రైతుల అమాయకత్వం, అవసరాలను ఆసరా చేసుకుంటున్న దళారులు అడ్డగోలుగా పత్తి కొనుగోళ్లను చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. పత్తి రైతులను దళారుల బెడద నుంచి కాపాడి మద్ధతు ధర దక్కే విధంగా మార్కెటింగ్ శాఖాధికారులు చర్యలు చేపడుతున్నామని చెబుతున్నా.. జిల్లాలో ఎక్కడా అలాంటి పరిస్థితులు కనిపించడమే లేదు. దీంతో దళారుల బారిన పడి పత్తి రైతులు దగా పడుతున్నారు. ముఖ్యంగా ఏజెన్సీ మారుమూల గ్రామాలలో యథేచ్ఛగా పత్తి కొనుగోళ్ల చేపడుతున్నారు. రైతుల నుంచి విడిగా కిలోల కొద్దీ సేకరించిన పత్తిని తిరిగి సీసీఐకి అధిక ధరలకు అమ్మేస్తు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ యేడు జిల్లాలో 4లక్షల 34వేల ఎకరాలలో పత్తి పంట సాగైంది. దీంతో 30లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటివరకు ప్రైవేట్, సీసీఐ కలిపి లక్ష క్వింటాళ్లకు పైగా పత్తిని కొనుగోలు చేశారు. అయితే ఆదిలాబాద్ మార్కెట్ కార్యాలయం పరిసర ప్రాంతాలతో పాటు ఆయా మండలాల్లోనూ అక్రమంగా పత్తి కొనుగోళ్లను చేపడుతున్నారు. క్షేత్ర స్థాయిలో నిఘా సారించాల్సిన మార్కెటింగ్ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ఈ దళారీ దందాకు అడ్డూ అదుపు లేకుండా పోతుందన్న ఆరోపణలు వస్తున్నాయి. అక్రమ పత్తి కొనుగోళ్లపై క్షేత్ర స్థాయిలో నిఘా సారించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఆదేశాలు జారీ చేసిన అసలు పట్టింపే లేకుండా పోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టపగలే నడిరోడ్డుపై విచ్చలవిడిగా పత్తి పంటను కొనుగోలు చేస్తున్నా.. మార్కెటింగ్ శాఖాధికారులు మామూలుగానే తీసుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● గ్రామాల్లో దళారుల బెడద

జిల్లా వ్యాప్తంగా పత్తి కొనుగోళ్ల ప్రారంభం కావడంతో గ్రామాల్లో దళారుల బెడద కనిపిస్తోంది. రైతులకు మాయమాటలు చెబుతూ నగదును ఆశచూపుతూ పత్తిని కొనుగోలు చేస్తున్నారు. నేరుగా రైతుల ఇంటి వద్దకే వెళ్లి పంట దిగుబడులను కొనుగోలు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. గ్రామాల్లో మంచి పలుకుబడి, పరిచయాలు ఉన్న వారి సహాయంతో పంటను కొనుగోలు చేస్తున్నారు. ప్రత్యేక వాహనం, సిబ్బందిని ఏర్పాటు చేసుకుంటున్న దళారులు.. గ్రామాల్లో యథేచ్ఛగా తిరుగుతూ పత్తిని సేకరిస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండానే కొనుగోళ్ల చేపడుతూ రైతులను నిండా ముంచుతున్నారు. ఎక్కడ పడితే అక్కడ కాంటాలు వేస్తూ కిలోల కొద్దీ పత్తి ముళ్లెలను తూకం వేస్తున్నారు. నగదు పేరితా ధరల్లో కోతలు విధిస్తున్నారు. మార్కెట్ నిబంధనలు, మద్ధతు ధరలపై కనీస అవగాహన లేని రైతులు రవాణాఖర్చు భారం, నగదు చేతికందడంతో క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న దళారులకే అమ్మేందుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో దళారీ దందాకు అడ్డుకట్ట పడడం లేదు. అధికారుల నిఘా వైఫల్యం కారణంగానే దళారులు మరింతగా రెచ్చిపోతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

● దళారులు చెప్పిందే లెక్క!

ఆరుగాలం కష్టపడి పండించిన పంటను దళారులకు అప్పగించడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో అమాయక, నిరక్షరాస్యులైన రైతులకు దళారులు చెప్పిందే లెక్కగా మారుతోంది. దళారులు చెప్పిందే ధరగా మారడంతో ఇచ్చింది తీసుకుంటూ సరిపెట్టుకుంటున్నారు. మార్కెట్ ధరల కంటే భారీగా తగ్గించి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. తేమ, నాణ్యత లేదంటూ సాకులు పెడుతు కిలో పత్తి రూ.50 నుంచి రూ.60 వరకు కొనుగోలు చేస్తున్నారు. రైతులు కూడా ఆర్థిక ఇబ్బందులతో ఆదరబాదరగా అమ్మేసుకుంటున్నారు. పత్తి ఏరేందుకు కూలీలకు చెల్లించాల్సిన డబ్బుల కోసం సన్న, చిన్నకారు రైతులు నిత్యం ఎంతో కొంత పత్తిని ఇంటి వద్దనే అమ్మేసుకుంటున్నారు.

(..... తరువాయి 6వ పేజీలో)

బోథ్‌లో ఫ్లెక్సీ వివాదం

బోథ్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య ఫ్లెక్సీ వార్ జరిగింది. ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలంలోని పొచ్చేరా క్రాస్ రోడ్డు వద్ద అనిల్ జాదవ్ ఎమ్మెల్యే ఫ్లెక్సీ పైన కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు నాయకులు మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో వివాదం రాజుకుంది. పొచ్చెరా ఫంక్షన్ హాల్‌లో జరిగిన వివాహ వేడుకకు స్థానిక ఎమ్మెల్యే హాజరై క్రాస్ రోడ్డు వద్ద చెక్కు పంపిణీ కార్యక్రమానికి వెళ్లారు. ఇదే సందర్భంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారి ఫ్లెక్సీని గమనించిన కొంత మంది కార్యకర్తలు తమ నాయకుని ఫ్లెక్సీ పైన కాంగ్రెస్ వారి ఫ్లెక్సీని ఎలా ఏర్పాటు చేస్తారంటూ తొలగించారు. ఎమ్మెల్యే ముందే ఫ్లెక్సీని తొలగిస్తుండగా ఫ్లెక్సీ ఇనుపచువ్వలకు తగిలి చిరిగిపోయింది. దీంతో ఆగ్రహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్కడికి చేరుకుని ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని సముదాయించారు. ఈ సందర్భంలో మార్కెట్‌కమిటీ ఛైర్మన్ బొడ్డు గంగారెడ్డితో పాటు మరికొంత మంది నాయకులు వచ్చి ఫ్లెక్సీని తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కావాలనే ఎమ్మెల్యే సమక్షంలో మా పార్టీకి చెందిన ఫ్లెక్సీలను తొలగించారు, ఇది సరైన పద్దతి కాదు, టీఆర్ఎస్ వారి గుం డాగిరిని ఆపకపోతే మేము ఊరుకోమని కాంగ్రెస్ పార్టీనాయకలు ఆడే గజేందర్ అన్నారు. మండల కేంద్రాల్లో ఎమ్మెల్యే ఫ్లెక్సీలను దహనం చేయాలని పిలుపునిచ్చారు. దీంతో ఫ్లెక్సీ రాజకీయం మరింత ముదిరే అవకాశం ఉంది. మండలంలోని పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద ఫ్లెక్సీ తొలగింపు వ్యవహారంలో విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్సై ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన ఫ్లెక్సీ చినిగిపోవడంతో వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బీఆర్ ఎస్ పార్టీకి చెందిన నలుగురిపైన విచారణ చేసి కేసు నమోదు చేస్తామన్నారు. అయితే ఇరుపార్టీల వారు సంయమనం పాటించాలని ఆయన కోరారు.


కాంగ్రెస్ ఫ్లెక్సీలు తొలగిస్తున్న బీఆర్ఎస్‌నాయకులు

జైనథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

జైనథ్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రమాణ స్వీకారోత్సవాన్ని నిర్వహించి నూతన పాలక మండలితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని నమ్ముకొని పనిచేసిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని కోరారు. జైనథ్ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా అల్లూరిఅశోక్‌రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా సావాపూరే విలాష్ డైరెక్టర్లుగా బాస సంతోష్, ఎల్మారాంరెడ్డి, దుమాల ఆశక్క, షేక్ మహామూద్, నిమ్మల ప్రభార్, నారకట్ల స్వామియాదవ్, గౌకర్ సీతారాం, తుని కావార్ రాజన్న, పాదలిరామన్న, తుడం రాములు ప్రమాణ స్వీకారం చేశారు.

సర్వేను అడ్డుకున్న మల్లాపూర్ గ్రామస్తులు

● ఇంద్రవెల్లిలో తిరిగి విలీనం చేయాలని గ్రామస్తుల డిమాండ్
● వెనుదిరిగిన ఉద్యోగులు

సిరికొండ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇండ్ల గుర్తింపు ప్రక్రియని శుక్రవారం మల్లాపూర్ గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. మల్లాపూర్ గ్రామాన్ని ఇంద్రవెల్లి మండలంలో తిరిగి విలీనం చేసే వరకు తమ గ్రామంలో ఎలాంటి సర్వే నిర్వహించకూడదని అధికారులకు తేల్చి చెప్పారు. ఇంద్రవెల్లి మండలంలో ఉన్న తమ గ్రామాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నూతనంగా ఏర్పాటుచేసిన సిరికొండ మండలంలో చేర్చడంతో ఇప్పటికీ అభివృద్ధికి నోచు కోవడం లేదన్నారు. అదే విధంగా సిరికొండ మండల కేం ద్రానికి వెళ్లాలంటే దూరభారంతోపాటు, సరైన రోడ్డుసౌకర్యం లేక నానా అవస్థలకు గురవుతున్నామని, సర్వే చేపడుతున్న అధికారులతో వేడుకున్నారు. గతంలో మాదిరిగా తమ గ్రామాన్ని ఇంద్రవెల్లి మండలంలోనే కొనసాగించాలని, రెవెన్యూ, పోలీస్ స్టేషన్ పరంగా తమ గ్రామం ఇంద్రవెల్లి మండలంలోనే ఇప్పటికీ కొనసాగుతుందన్నారు. గ్రామపంచాయతీ పరంగా కూడా ఇంద్రవెల్లి మండలంలో చేర్చే వరకు ఈ ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే ని జరగనివ్వబోమని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. సిరికొండ నుంచి తిరిగి ఇంద్రవెల్లి మండలంలో తమ గ్రామాన్ని విలీనం చేస్తేనే తమ గ్రామంలో సర్వే నిర్వ హించాలని అన్నారు. దీంతో ఇళ్ళ గుర్తింపు ప్రక్రి యను చేపడుతున్న అధికారులు వెనుదిరిగారు. ఇదే విషయమై ఎంపీవో సంతోష్‌ను వివరణ కోరగా.. మల్లాపూర్ గ్రామస్తులు సర్వేని అడ్డు కున్నది నిజమేననీ, దీనిని కలెక్టర్ దృష్టికి తీసు కెళ్తామని ఆయన తెలిపారు.

సొంత ఊరి రుణం తీర్చుకుంటా

● బీహార్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ


సమావేశంలో మాట్లాడుతున్న బీహార్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ రాజేందర్

భోథ్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తనకు జన్మనిచ్చిన ఊరు చదువుకున్న పాఠశాల చదువునేర్పిన గురువులను ఎన్నడూ మర్చిపోనని తాను పదవీవిరమణ పొందిన తరువాత గ్రామాభివృద్ధి కోసం తనవంతు కృషి చేస్తూ గ్రామంలోనే ఉంటానని సీనియర్ ఐఏఎస్ అధికారి, బీహార్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.రాజేందర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన స్వగ్రామమైన మండలంలోని కౌటా(బీ) గ్రామంలో చదువుకున్న పాఠశాలలను తిరిగి పరిశీలించారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు కృషి ఎళ్లవేళలా ఉంటుందని, పదవీ విరమణ తరువాత ఇదే నేల మట్టి రుణాన్ని తీర్చుకుంటానన్నారు. చిన్ననాడు చదివిన పాఠశాల తన జీవితానికి బంగారు బాట వేసిన గురువులను గుర్తుచేసుకుని పిల్లలకు తన జీవితం గురించి వివరించారు. ఇక్కడే చదివి ఐఏఎస్ అధికారిగా ఎదగడం జరిగిందన్నారు. పట్టుదలతో చదివితే సాధించనిది ఏది లేదన్నారు. గ్రామంలోని పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శశిధర్‌రెడ్డి, బోథ్ ఎస్ఐ ప్రవీణ్, విశ్రాంత ఉపాధ్యాయులు వినాయకరెడ్డి, వీడీసీ అధ్యక్షులు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గంగాధర్, మాజీ ఉప సర్పంచ్ రవీందర్, యూత్ అధ్యక్షులు సోమేష్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలి

● జిల్లా విద్యాధికారి ప్రణీత

తలమడుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి ప్రశ్నలకు సమాధానం చెప్పే విధంగా ఎదగాలని, వీరికి మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా విద్యాధికారి ప్రణీత కోరారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా ప్రణీత మాట్లాడుతూ పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదువుకొని వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అదే విధంగా విద్యార్థులు ప్రతి సబ్జెక్టులోనూ ప్రశ్నలకు సమాధానాలు చెప్పే విధంగా ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ప్రతి పాఠశాలలో వంద శాతం విద్యార్థులు పాఠశాలకు హాజరుకావాలని సూచించారు. అదే విధంగా జిల్లాలో ప్రతి పాఠశాలలో విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి రుచి చూశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానో పాధ్యాయుడు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో

హాకీకి పూర్వవైభవం తీసుకురావడం అభినందనీయం : బీజీఆర్

ఆదిలాబాద్ రూరల్, నవంబరు 08 (ఆంధ్ర జ్యోతి) : హాకీ టోర్నమెంట్ అండర్-17లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించిన ఆదిలాబాద్ జిల్లాలో హాకీ క్రీడకు పూర్వవైభవం తీసుకురావడం అభినందనీయమని ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-17 హాకీ టోర్నమెంట్‌లో జిల్లా క్రీడా కారులు ప్రథమ బహుమతి సాధించి జిల్లాకు వచ్చిన సందర్భంగా రైల్వేస్టేషన్‌లో వారికి శుక్రవారం ఘనంగా స్వాగతం పలికి, రాష్ట్రస్థాయి హాకీక్రీడలో ప్రథమ బహుమతి సాధించిన క్రీడాకారులను అభినందించారు. ఈ సం దర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించేలా లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. చాలా కాలం తర్వాత ఆదిలాబాద్ జిల్లాకు ప్రథమ స్థానం రావడం సంతోషంగా ఉందన్నారు. కప్ సాధించిన జట్టులో నలుగురికి జాతీయస్థాయిలో అవకాశం రావడం జరిగిందని తెలిపారు. ఇదే స్ఫూర్తితో జాతీయస్థాయిలో రాణించేందుకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులు కప్ సాధించేలా కృషి చేసిన కోచ్‌లను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి పార్థసారథి, కోచ్‌లు శ్రీను, రవి, డెవిడ్ పాల్గొన్నారు.

బీమా పథకాలను వినియోగించుకోవాలి

● లీడ్‌బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్‌కుమార్

ఇచ్చోడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు అందించే బీమా పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని లబ్ది పొందాలని లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్‌కుమార్ దామ్ తెలిపారు. శుక్రవారం ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామంలో జన సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష బీమా యోజన పథకాలపై గ్రామస్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. తక్కువ రూపాయాలతో కేంద్ర ప్రభుత్వం బీమా పథకం అందిస్తుందని, సామాన్య మధ్య తరగతి కుటుంబాలకు ఆసరాగా బీమా పథకాలు ఉపయోగపడతాయన్నారు. బ్యాంకులో పొదుపు ఖాతాలు, డిపాజిట్లు, రుణాలు, సైబర్‌నేరాలపై ఖాతాదారులకు అర్థమయ్యేరీతిలో వివరించారు. కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ విజయ్, ఆర్థిక అక్షరాస్యత సంస్థ కౌన్సిలర్లు సం తోష్, అరవింద్, దంజి, ఎస్బీఐ సర్వీస్ పాయింట్ సాగర్ గ్రామస్థులు పాల్గొన్నారు.

దళారీ దందా!

(5వ పేజీ తరువాయి)

నగదు చేతికి రావడంతో పెట్టుబడి ఖర్చుల అవసరాలను తీర్చుకుంటున్నారు. అయితే తూకంలో భారీగా మోసం, తేమ పేరుతో ధరల్లో కోతలు పెడుతూ అడ్డగోలుగా దండుకుంటున్నారు. అడిగే వారే లేక పోవడంతో ఇష్టారాజ్యంగా తూకం వేస్తూ దోపిడీ దందాకు ఎగబడుతున్నారు. కొన్ని గ్రామాల్లో బండరాళ్లతో కూడా పత్తిని తూకం వేస్తున్న సందర్భాలు కనిపిస్తున్నాయి. తమకున్నపరిజ్ఞానంతో ఎలక్ట్రానిక్ కాంటాల్లోనూ మార్పులు, చేర్పులు చేస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. అడుగడుగునా పత్తి రైతులు దగా పడుతున్న అధికారులు కట్టడి చర్యలు చేపట్టక పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేస్తాం

- గజానంద్ (జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి)

గ్రామస్థాయిలో అక్రమంగా పత్తి కొనుగోళ్లను చేపడితే చర్యలు తప్పవు. ఇప్ప టికే క్షేత్ర స్థాయిలో సిబ్బందిని అప్రమత్తం చేయడం జరిగింది. వ్యవసాయ శాఖ, రెవెన్యూ, గ్రామ పంచాయతీ సిబ్బంది అక్రమ పత్తి కొనుగోళ్ల పై నిఘా సారించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది. జిల్లాలోని అన్ని మార్కెట్ కార్యాలయ సిబ్బందిని అప్రమత్తం చేసి దళారిదందాకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటాం. దీనిపై సీరియస్‌గానే దృష్టిసారిస్తున్నాం.

పొన్నారి హనుమాన్ మందిరంలో చోరీ

తాంసి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పొన్నారి గ్రామ సమీపంలో ఉన్న సంకటమోచన హనుమాన్ మందిరంలో చోరీ జరిగింది. శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో ఆలయ పూజారి కమల్ కిషోర్ మహరాజ్ కాలకృత్యాల కోసం బయటకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తి హనుమాన్ గర్భగుడిలోకి ప్రవేశించి విగ్రహంపై ఉన్న వెండి కిరిటాన్ని దొంగిలించారు. సీసీ ఫుటేజీని పరిశీలించగా యువకుడు ఈ చోరీకి పాల్పడి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే తాంసి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు.

పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

భోథ్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సాధించడం జరుగుతుంది. మండల విద్యాధికారి కుమ్మరి పోశెట్టి పేర్కొన్నారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయం వద్ద పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం వారు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతితో తనపై మరింత భారం పెరిగిందని ఉద్యోగానికి న్యాయం చేయాలంటే కఠిన నిర్ణయానికి తీసుకోక తప్పదన్నారు. సన్మానించిన వారిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహ్మద్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షులు ఉపాధ్యక్షులు ఆర్‌టీవీ ప్రసాద్, హన్మాండ్లు, సంఘ స్వామి ముతాంజ్‌ఖాన్, రజిత, పుష్పల శ్రీనివాస్ రవిరాజ్ పాల్గొన్నారు.

లఖింపూర్‌లో వైద్యశిబిరం

నేరడిగొండ, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : చలికాలంలో చర్మవ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని విద్యార్థులు జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి సద్దాం అన్నారు. శుక్రవారం మండలంలోని లఖింపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు ఉచిత పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని చలికాలంలో వెచ్చని దుస్తులు ధరించాలన్నారు. ఆయన వెంట హెచ్ఈఓ పవార్ రవీందర్, హెచ్‌ఏ శ్రీనివాస్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, వార్డెన్ స్వప్న ఉన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

ఇంద్రవెల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలోని దస్నాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... దస్నాపూర్‌గూడ గ్రామానికి చెందిన జవాడే, కవిత దంపతులకు చెందిన కూతురు జవాడే అంజలి(13) 8వ తరగతి చదువుతుంది. శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగి స్పృహ కోల్పోయింది. స్థానికులు గమనించి రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతిచెందినట్లు తెలిపారు. విద్యార్థిని పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న విషయం వాస్తవమే, కానీ ఇప్పటి వరకు ఎవరు కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని ఎస్సై దుబ్బాక సునీల్ తెలిపారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేస్తున్న ఆడే గజేందర్



వృద్ధాశ్రమంలో కేక్ తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కేక్‌ను కట్ చేస్తున్న కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్‌నాయకులు

నేరడిగొండ, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్‌నియోజక వర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. త్వరలోనే ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో ప్రతి ఒక కుటుంబ సభ్యులు దగ్గరుండి వివ రాలు నమోదు చేయించాలన్నారు. వచ్చే స్థానికసంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బోథ్, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ప్రఫుల్‌చందర్‌రెడ్డి, షైమూద్‌ఖాన్, జిల్లా నాయకులు కోటేశ్, రాజశేఖర్‌రెడ్డి, బోథ్ మార్కెట్ కమిటీ అధ్యక్ష ఉపాధ్యక్షులు గంగారెడ్డి, ఆడేవసంత్‌రావు, బద్దంపోతారెడ్డి, సుభాష్, సంజీవ్, బ్రహ్మానంద్, నారాయణ్‌రెడ్డి, రమేష్, శంకర్, తొడసం శంకర్ తదితరులున్నారు.

ఆదిలాబాద్ : బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డైనమిక్ లీడర్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రజాభవన్‌లో ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి భారీ స్పందన వచ్చింది. కాంగ్రెస్ పార్టీశ్రేణులు, అభిమానుల మధ్య భారీకేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టి సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అనంతరం ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో లబ్ధిపొందుతున్న లబ్ధిదారులను శాలువాతో సన్మానించారు. ఇందులో సీనియర్ నాయకులు గిమ్మసంతోష్, డేరా కృష్ణారెడ్డి, షకీల్, ఆశమ్మ, పలువురు కార్యకర్తలు, నాయకులు తదితరులున్నారు.

మావల: ముఖ్యమంత్రి రేవంతరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి, మావల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మావల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కాంగ్రెస్ శ్రేణులు హాజరై కేక్‌కట్ చేసి ఒకరికొకరు తినిపించుకుని సీఎంకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కేఆర్కే కాలనీలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు తడిసెన వెంకట్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ మావల మండల అధ్యక్షులు కుంబోజి రాములు, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు పాల్గొన్నారు.

తలమడుగు: సమగ్ర కుటుంబ సర్వే దేశానికి ఆదర్శమని మాజీ జడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామంలో మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణం లక్ష్మీ రాజేశ్వర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్‌కట్ చేసి ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మండలకేంద్రంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి పార్టీ నాయకులకు తినిపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం, పట్టణ అధ్యక్షులు ఎం.డి.జహార్, నాయకులు మెస్రం నాగనాథ్, ఎండి మసూద్, సోమోరే నాగోరావు, మహిళా అధ్యక్షురాలు సోన్ కాంబ్లే, లక్ష్మీ బాయి, మాజీ సర్పంచ్ జాదవ్ శారద తదితరులు పాల్గొన్నారు.

బోథ్ : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను మండలంలోని సోనాల గ్రామంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంచి జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సోనాల పట్టణ అధ్యక్షులు చెట్లపల్లి అనిల్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ బత్తుల రమేష్, సీనియర్ నాయకులు గాజుల పోతన్న, విజయ భాస్కర్‌రెడ్డి, కసిరి పోతన్న, రామాయణ గంగారెడ్డి, సంతోష్‌రెడ్డి, రాజేష్, శ్రీనివాస్, అమృతరావు, అనిల్ , రమేష్, గోరేమియా తదితరులు పాల్గొన్నారు.

రైతులను నిండా ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం

● ఎమ్మెల్యే అనిల్ జాదవ్



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

బోథ్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇష్టం వచ్చిన హామీలతో ప్రజలని మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతాంగాన్ని నిలువుదోపిడీ చేసి నిండా ముంచారని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. శుక్రవారం పొచ్చెర క్రాస్ రోడ్డు వద్ద పులి బాధిత రైతుకు అటవీశాఖ తరపున మంజూరైన చెక్కును అందించారు. అనంతరం అక్కడే విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా కె.చంద్రశేఖర్‌రావు ఎన్ని ఇబ్బందులున్నా తెలంగాణ రైతాంగానికి అండగా నిలిచారన్నారు. రైతుబంధుతో పాటు రైతు రుణ మాఫీ గిట్టుబాటు ధర కల్పన కేవలం మాజీ ముఖ్యమంత్రి వల్లే జరిగిందన్నారు. ఆయనను ప్రజలు మరిచిపోలేరని స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు మరోసారి పట్టం కడతారన్నారు. పత్తి పంట కొనుగోలు కొర్రీలు పెట్టి తేమ పేరుతో రైతాంగాన్ని దోసుచుకుంటున్నారన్నారు. పత్తి రైతుల దోపిడీని చూడలేక తాను సీసీఐ ఆధ్వర్యంలో చేపట్టిన పత్తి కొనుగోళ్ళకు శుక్రవారం వెళ్లలేకపో యానన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో దేశంలో కెల్లా నాణ్య మైన పత్తిని రైతులు పండిస్తారని ఇక్కడి రైతులు పండించిన పత్తికి అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. కాని గుజరాత్ రాష్ట్రంలో పండించిన పత్తికి ఒక ధర తెలంగాణ రైతాంగం పండించిన పత్తికి ఎక్కువ ధర పెట్టడం వల్ల తెలంగాణ రైతు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ విషయాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న నాయకులు గాని రాష్ట్రంలో ఉన్న అధికార పార్టీ నాయకులు గాని ఎక్కడ మాట్లాడం లేదన్నారు. తేమ పేరుతో కొర్రీలు పెడితే ఉద్యమించక తప్పదని హెచ్చరించారు. మరోసారి రైతులు ఉద్యమానికి సిద్దమవుతున్నారన్నారు.

ఔడా చైర్మన్‌గా కంది శ్రీనివాస్‌రెడ్డి!

ఆదిలాబాద్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్ చార్జీ కందిశ్రీనివాస్‌రెడ్డి ఆదిలాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (ఔడా) చైర్మన్‌గా ప్రభుత్వం నియమించే అవకాశం కనిపిస్తుంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది. త్వరలోనే ప్రభుత్వ ఉత్తర్వులు వెల్లడయ్యే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే గత అసెంబ్లి ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓటమి పాలైన కందికి ప్రోటోకాల్ పదవి ఇచ్చేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధమైనట్లు తెలుస్తుంది. త్వరలోనే నియమించే జిల్లా పార్టీ అధ్యక్ష (డీసీసీ)పదవిని ఆశిస్తున్న కంది వైపే పార్టీ అధిష్ఠానం మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. అయితే కొందరు సీనియర్ నాయకులు కూడా డీసీసీ పదవిని ఆశిస్తున్న వారిలో ఉన్నారు. పార్టీని ముందుకు నడిపే సత్తా ఉన్న నేతకే డీసీసీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని పార్టీలో ప్రచారం జరుగుతుంది. మొత్తానికి త్వరలోనే కందికి ఆదిలాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ చైర్మన్ పదవి దక్కే అవకాశాలు మెరుగా ఉన్నాయంటూ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతుంది.

వృత్తి నైపుణ్య శిక్షణతో అభివృద్ధి..

ఆదిలాబాద్‌అర్బన్ : వృత్తి నైపుణ్య శిక్షణతో ఆర్థిక అభివృద్ధి సాధించవచ్చని కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని విద్యానగర్‌లో గల శ్రీరామనంద తీర్థట్రస్టు గ్రామీణ సంస్థ ఆధ్వర్యంలో షిర్డిసాయి స్కిల్ డెవలప్‌మెంట్ వారు మహిళలకు టైలరింగ్, మగ్గం, కంప్యూటర్ విభాగంలో శిక్షణలు అందించారు. శుక్రవారం కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్లను పంపిణీ చేయగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నియోజక వర్గ ఇన్‌చార్జి కందిశ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో టైలరింగ్, మగ్గం వర్క్స్‌కు మంచి డిమాండ్ ఉందన్నారు. కుటుంబానికి అండగా నిలవాలన్నారు.

నిర్మల్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



పండ్లు పంపిణీ చేస్తున్న మహిళా కాంగ్రెస్ నాయకులు



నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఒక ఆలయంలో పూజలు



బాసర ఆలయంలో పూజలు

నిర్మల్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, గ్రంథాలయ చైర్మన్ అర్జుమన్ అలీ, ఏఎంసీ చైర్మన్ భీమ్‌రెడ్డి కేక్‌కట్ చేశారు. ప్రసూతి ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను, అజహర్ హుస్సేన్, జునైద్ మెమన్, కౌన్సిలర్, ఇమ్రానుల్లా, దేవరకోట చైర్మన్ శ్రీనివాస్, అయ్యన్నగారి పోశెట్టి, సాయి, ఖిజర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో పండ్ల పంపిణీ

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో డవ్ వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. జిల్లా ఉపాధ్యక్షురాలు అల్లూరి కృష్ణవేణి, పార్టీ మండల అధ్యక్షుడు గంగాధర్, వాసవి, లక్ష్మీ, రేఖ, హరి, తదితరులు పాల్గొన్నారు.

దేవరకోట వెంకటేశ్వరాలయంలో పూజలు

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా శుక్రవారం దేవరకోట వెంకటేశ్వరాలయంలో మున్సిపల్ చైర్మన్ జి.ఈశ్వర్ ప్రత్యేకపూజలు చేశారు. డీసీసీ అధ్య క్షుడు శ్రీహరిరావు సూచన మేరకు జరిగిన పూజలో మార్కెట్ కమి టీ చైర్మన్ సోమ భీమ్‌రెడ్డి, దేవరకోట ఆలయ చైర్మన్ కొండా శ్రీని వాస్, సభ్యులు, పట్టణ అధ్యక్షుడు నాందేడపు చిన్ను పాల్గొన్నారు. రేవంత్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

బాసరలో ..

బాసర, నవంబర్, 8: (ఆంధ్రజ్యోతి) : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో ఆ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీఎం పేరు మీద అర్చన జరిపించారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో సీఎం జన్మదిన వేడుకలను పెద్ద ఎత్తున జరిపారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద యాచకులకు పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎం. రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్‌రావు దేశాయ్, జే. రమేష్, రాందాస్, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపల్లి(జి) తండా గ్రామంలో ..

నర్సాపూర్(జి), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూరుగుపల్లి(జి) తండా గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను సమత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు సమత ఫౌండేషన్ చైర్మన్ పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమత ఫౌండేషన్ చైర్మన్ సమత సుదర్శన్, సాహెబ్‌రావు (ఆర్గనైజర్), క్రాంతి (పీఆర్‌వో), అనిల్ (సీఈవో), రాజేశ్వర్ (గొల్లమాడ మాజీ సర్పంచ్), శ్రావణ్ (బూరుగుపల్లి మాజీ సర్పంచ్), యూనివర్సిటీ విద్యార్థి నాయకులు యోగేష్, రతన్, ప్రభాకర్, ముత్యంలు పాల్గొన్నారు.

పుస్తకాల పంపిణీ

పెంబి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ సమీపంలో కేక్ కట్ చేసి, టపాకాయలు పేల్చి ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు స్వప్నిల్‌రెడ్డి, ఎంఈవో రాంచందర్, కాంగ్రెస్ నాయకులు తులాల శంకర్, మల్లపల్లి స్వామి, గంగాధర్, రమేష్, తదితరులు ఉన్నారు.

ప్రైమరీ పాఠశాలలో..

సోన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో సోన్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నక్కల మధుకర్ రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సారంగాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని స్వర్ణలో గల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం మార్కెట్ చైర్మన్ అబ్దుల్ హాది, కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ నేపథ్యంలో కేక్‌కట్ చేసి విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. జన్మదిన వేడుకల్లో నాయకులు రాజ్ మహ్మద్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ఉన్నారు.

లక్ష్మణచాంద, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కస్తూరిబా గాంధీ పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు శుక్రవారం పండ్లను పంపిణీ చేశారు. అంతకుముందు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఒడ్నాల రాజేశ్వర్, కస్తూరిబా పాఠశాల ప్రత్యేక అధికారి నవిత, నిర్మల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుంకరి సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నగేష్, శేఖర్, రజినీకాంత్, కార్యకర్తలు ముద్రవేణు, వినేష్, సుంకరి గంగయ్య, భీమేష్, భూమేష్, శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో..

దస్తురాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోత) : మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి సీఎం రేవంత్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, నాయకులు రమేష్ రావు, శ్రీనివాస్, పుల్యా నాయక్, రాజేశం, గోపి, నాగరాజు, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



సోన్ మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాలలో పండ్ల పంపిణీ

కుంటాల, నవంబర్, 8 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాలలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జుట్టు మహేందర్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ జుట్టు లక్ష్మణ్ నాయకులు వెంకటేష్, ఫహీమ్ ఖాన్, గజేందర్, రాకేష్‌తో పాటు పలువురు ఉన్నారు.

భైంసా రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : భైంసా పట్టణంలో మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్ ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. దేవుడి ఆశీర్వాదం వల్ల నిండు నూరేళ్ల సుఖశాంతులతో ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారు. రాష్ట్రంలో ప్రవేశపెట్టిన పథకాలు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, రెండు లక్షల రుణమాఫీ, విద్యార్థులకు మంచి విద్య, మహిళలకు ఉచిత ప్రయాణం, వంట గ్యాస్, ఇందిరమ్మ ఇళ్లు ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అభివృద్ధి చేస్తూ ముందుకు తీసుకెళ్తున్నటువంటి మన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేదలకు కావలసిన పథకాలను ప్రారంభించి అభివృద్ధి పథంలో నడిపిస్తున్న నాయకుడు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, మాజీ మున్సిపల్ చైర్మన్ ఓం ప్రకాష్, భైంసా టౌన్ అధ్యక్షుడు షాహిద్ భాయ్, మాజీ ఎంపీపీ రాంచందర్ రెడ్డి, ఓంప్రకాష్, నితిన్, విలాస్, సాహెబ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్ గాంధీచౌక్‌లో కేక్ కట్ చేసిన ఎమ్మెల్యే

ఖానాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఖానాపూర్ తెలంగాణ చౌక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు కేక్‌ను కట్ చేసి సీఎం రేవంత్‌రెడ్డి బర్త్‌డే వేడుకల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఒకరికొకరు కేకులు తినిపిస్తూ సంబరాలు చేసుకున్నారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని స్థానిక కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఎల్ముల శోభన్ బాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పనుల పంపిణీ నిర్వహించారు. ఈ వేరువేరు కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొనికెని దయానంద్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ కావలి సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ ఆమంద శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, కౌన్సిలర్లు పరిమి లత, కిషోర్ నాయక్, కురుమ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మడిగెల గంగాధర్, శెట్టి శ్యామ్ మోహన్ రావు, జన్నారపు శంకర్, గొర్రె గంగాధర్, జంగిలి శంకర్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఖానాపూర్‌ను అగ్రగామిగా నిలుపుతా

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ● పట్టణంలో 12 వార్డుల్లో రూ. 4.80 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపన
● మున్సిపల్ పార్క్, శ్మశాన వాటిక ప్రారంభం



ఖానాపూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధిలో ఖానాపూర్‌ను అగ్రగామిగా నిలుపుతానని ఎమ్మెల్యే వెడ్మబొజ్జు అన్నారు. మండల కేంద్రం సహా మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఖానాపూర్ పట్టణంలో ఇదివరకే నిర్మించిన మున్సిపల్ పార్క్‌ను, శ్మశాన వాటికను ప్రారంభించారు. మున్సిపల్ పాలకవర్గం ఆధ్వర్యంలో మున్సిపల్ పార్క్ ఎదుట నూతనంగా నిర్మాణం చేసిన ఐలవ్‌ఎంసీకే లోగోను ప్రారంభించిన ఎమ్మెల్యే లోగో వద్ద స్థానిక నాయకులతో కలిసి ఫోటోలు దిగారు. అనంతరం ఖానాపూర్ పట్టణంలోని 12 వార్డుల్లో రూ. 4.80 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు పలుచోట్ల ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్ని వర్గాలకు లబ్ధిచేకూరేలా సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం ప్రవేశపెడుతోందన్నారు. ప్రతి పక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఖానాపూర్ పట్టణ ప్రజల ఆరోగ్యం కోసం మున్సిపల్ పార్క్‌లో ఓపెన్ జిమ్‌తో పాటు వాకింగ్ ట్రాక్‌లు, యోగాశాల లాంటి సదుపాయాలను కల్పించామన్నారు. అనంతరం 11వ వార్డులో ఇటీవల కోతుల దాడిలో మృతి చెందిన బొంగోని లక్ష్మీ కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు.

రైతు విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేయండి


ఖానాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఖానాపూర్ పట్టణంలో తిమ్మాపూర్ (ఖానాపూర్) మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న రైతు నాగలి విగ్రహ ఆవిష్కరణను విజయవంతం చేసి మున్నూరు కాపుల ఐక్యత చాటుదామని మున్నూరు కాపు సంఘం తిమ్మాపూర్ (ఖానాపూర్) అధ్యక్షులు కడకుంట్ల రవీందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని తిమ్మాపూర్ (ఖానాపూర్) మున్నూరు కాపు సంఘ భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మున్నూరు కాపుల కులవృత్తి వ్యవసాయమని చాటేలా వ్యవసాయానికి ప్రతీక అయినటువంటి రైతు నాగలి విగ్రహాన్ని ఖానాపూర్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేయాలని తమ సంఘం నిర్ణయించిందన్నారు. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండే విఠల్ సహా మాజీ మంత్రి జోగు రామన్న, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పలువురు మున్నూరు కాపు ప్రముఖులు హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం తిమ్మాపూర్ (ఖానాపూర్) గౌరవ అధ్యక్షులు బీసీ రాజన్న, మండల ప్రధాన కార్యదర్శి దొనికెని దయానంద్, తిమ్మాపూర్ (ఖానాపూర్) సంఘం ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేష్, కోశాధికారి సిరిపురం నాగరాజు, సంఘం ముఖ్య సలహాదారులు బక్కశెట్టి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, మడిగెల గంగాధర్, కొక్కుల ప్రదీప్, జి. సందీప్, ఎడ్ల రాజేందర్, తదితరులున్నారు.

గౌడహక్కుల పోరాట సమితి నిర్మల్ జిల్లా అధ్యక్షుడిగా కనకాగౌడ్

కుభీర్, నవంబరు 11 : జిల్లా గౌడజన హక్కుల పోరాట సమితి అధ్యక్షునిగా కుభీర్ మండల కేంద్రానికి చెందిన కనకాగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డాడు. శుక్రవారం జిల్లా కేంద్రం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన మహాసభలలో జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష పదవిని అందజేసినందుకు గాను జాతీయ, రాష్ట్ర కార్యవర్గానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను శాలువతో సన్మానించారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


కుంటాల, నవంబర్, 8: (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై భాస్కరాచారి అన్నారు. శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమైందని విద్యార్థులు ఎలాంటి చెడు వ్యసనాలకు లోనుకాకుండా తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయులు రతన్‌కుమార్, లక్ష్మణ్, బోజన్న, సాహెబ్ రావు, చిన్నారెడ్డి, భూమన్న, లక్ష్మీ ధర్మాజీ తదితరులు ఉన్నారు.





• హిమాలయాలను తలపిస్తున్న మంచు అందాలు





ఫొటో న్యూస్



• ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో మంచు దుప్పటితో కమ్ముకున్న గిరిపల్లెలు

మంచు కురిసే వేళలో..

• గిరి పల్లెల్లో మంచు అందాలు
• ఊటీ, కొడై కెనాల్ అందాలను తలపిస్తున్న కోసాయి ప్రకృతి వనాలు

తలమడుగు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మంచు కురిసే వేళలో ప్రకృతి అందాలు కనువిందు చేస్తున్నాయి. శీతాకాలం నేపథ్యంలో జిల్లాలో చలి ప్రభావం పుంజుకుంది. రాత్రి తెల్లవార్లు సమయంలో మంచు కురుస్తూ తెల్లవారు జాము పల్లెలు తెల్లటి మంచు పొరలను కమ్ముకుంటున్నాయి. ఊటీ, కొడై కెనాల్, లంబసింగి లాంటి ప్రకృతి అందాలకు నిలయం గిరిపల్లెలు. తెలంగాణ సరిహద్దు ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని కోసాయి, దేగామ, ఉమ్రి, పల్సి(బి), పల్సి(కె), రత్నాపూర్, మండగూడ, ఝరి పూనగూడ, ఆదివాసి గుడాలు తెల్లటి మంచుపొరలను పరుచుకుని అడవులన్నీ మంచుతో కప్పబడి ప్రత్యేక అందాలను తీసుకువస్తున్నాయి. ఈ ప్రకృతి అందాలను చూసేందుకు ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది ప్రకృతి ప్రేమికులు కోసాకి గ్రామానికి వస్తుంటారు. అదే విధంగా రెండు కొండల మధ్య నుంచి పొగలు కమ్ముకుంటూ రైలు బండి రావడంతో ప్రకృతి ప్రేమికులు, మరింత మహిమరిచిపోయి తిలకిస్తున్నారు. కోసాయి గ్రామసమీపంలో గల సకంట మోచన హనుమాన్ ఆలయాన్ని, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దితే జిల్లాకు మరింత గుర్తింపు లభిస్తుందని జిల్లా వాసులు కోరుతున్నారు. ఈ చిత్రాలను జిల్లాకు చెందిన వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ శుక్రవారం ఉదయం తన కెమెరాలో బంధించాడు.



• చెట్లను కమ్మేసిన పొగమంచు



• రత్నాపూర్ అడువల్లో సృష్టికే వన్నె తెచ్చిన అటవీ అందం

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

• డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

తాంసి, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం తాంసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సును ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు ఎలాంటి గొడవల్లో తల దూర్చవద్దని సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ఎవరైనా గొడవ పడితే వారికి సున్నితంగా గొడవల విషయంపై చట్టాల విషయంపై అవగాహన కల్పించాలని కోరారు. చట్టాలపై తోటి విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఉమేష్ జోలే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, పీపీ రమణరెడ్డి పాల్గొన్నారు.

గుట్కా దందానే కొంపముంచిందా?

• గుట్కా సరుకులతోనే అప్పు • తండ్రీ కూతురు ఆత్మహత్య ఘటన నిందితుల చీకటి వ్యాపారం

బాసర, నవంబరు 8: (ఆంధ్రజ్యోతి): గుట్కా దందానే వేణు కుటుంబం కొంపముంచిందా? నిషేధిత పదార్థాల విక్రయాలే ఆ కుటుంబం ఆత్మహత్యకు కారణమైందా? అనే ప్రశ్నలకు అవుననే సమాధానాలు వస్తున్నాయి. నిజామాబాద్ నగరం ఉప్పలించి వేణు కుటుంబాన్ని, అతని కుమార్తె ఆత్మహత్య చేసుకోవడం, అతని భార్య అనురాధ చివరి క్షణాల్లో ప్రాణాలతో బయటపడ్డ ఘటనతో అనేక విషయాలు వెలుగుచూస్తున్నాయి. గుట్కా వ్యాపారం వేణు కుటుంబాన్ని ఆగం చేసింది. ఈకేసులో కీలకంగా మారిన వేణు భార్య తెలిపిన వివరాలను బట్టి చూస్తే నిజామాబాద్ పట్టణానికి చెందిన వ్యాపారులు రోషన్, వికాస్‌లు నిషేధిత గుట్కా దందా చేస్తున్నట్లు అర్థమవుతోంది. దుకాణం నిర్వహించుకునే వేణు వారి వద్ద నుంచి గుట్కా కొనుగోలు క్రమంలోనే అప్పు ఏర్పడిందని విచారణలో వెల్లడించినట్లు సమాచారం. రోషన్, వికాస్‌లు పెద్దఎత్తున నిషేధిత గుట్కాదందా సాగిస్తున్నట్లు బాసర ఘటనతో వెలుగులోకి వచ్చింది. వేణు గుట్కా సరుకులు తీసుకుంటూ తిరిగి డబ్బులు చెల్లించకపోవడం, ఆ బకాయి మొత్తం రూ.3 లక్షల వరకు చేరి ఉండవచ్చునని వసూలు చేసే క్రమంలో వ్యాపారుల వేధించినట్లు తెలుస్తోంది. సదరు వ్యాపారుల చీకటివ్యాపార వాస్తవాలేమిటో అధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది.

• రూ.3 లక్షలకే ప్రాణాలు తీసుకుంటారా?

వేణు కుటుంబం ఆత్మహత్యాయత్నం ఘటనపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్‌లో వ్యాపారం చేసే వేణులాంటి స్థాయి వారికి రూ.3లక్షలు పెద్ద సమస్య తెలుస్తోంది. ఆత్మహత్య కంటే ముందు వ్యాపారి కారణంగా ఏదైనా ఘటన జరిగి ఉండవచ్చుననే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లేదంటే రూ.3లక్షల కోసం ఓ కుటుంబం ఆత్మహత్య చేసుకునే అవకాశం ఉండదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వేణు భార్య చెబుతున్నట్లు మహిళా సభ్యులను బెదిరించడమే కాకుండా డబ్బుల వసూలు కోసం కిరాయి మనుషులను ఇంటికి పంపిస్తామంటూ తీవ్రమైన బెదిరింపులు చేయడం వల్లనే వేణు కుటుంబ సభ్యులు ఆందోళనకు గురైనట్లు తెలుస్తోంది.



గ్రీన్ ఫీల్డ్ స్టేడియం ప్రవేశ ద్వారం వద్ద విరిగిపోయిన గేటు

ఆంధ్రజ్యోతి ఫోకస్



ఖానాపూర్ శివారు ప్రాంతంలో నిర్మించిన గ్రీన్ ఫీల్డ్ స్టేడియం



స్టేడియం ఆవరణలోని ఇండోర్ స్టేడియం భవన కిటికీ అద్దాలు ధ్వంసమైన దృశ్యం

సౌకర్యాలున్నా.. ఉపయోగం సున్నా!

» గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో కొరవడిన అధికారుల పర్యవేక్షణ » విరిగిన గేటు, పగిలిన ఇండోర్ స్టేడియం అద్దాలు • మైదానంలో ఎత్తువంపులుగా మైదానం, ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు
» ప్రాక్టీస్‌కు మైదానం ఉపయోగకరంగా లేదంటున్న యువకులు » కొద్దిపాటి పనులు నిర్వహిస్తే ఉపయోగకరమంటున్న స్థానికులు

ఖానాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖానాపూర్ ప్రాంతంలో క్రీడాకారులు, యువకులు, మార్నింగ్ వాకింగ్, యోగా చేసేవారికి సౌకర్యంగా గత ప్రభుత్వం అన్ని హంగులతో పట్టణ శివారులో నిర్మించిన గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో అన్ని సౌకర్యాలున్నా.. ఉపయోగం సున్నా.. అన్నట్లుగా మారింది. నాటి ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి గ్రీన్ ఫీల్డ్ స్టేడియాన్ని నిర్మించిందే తప్ప దాని నిర్వహణను పట్టించుకోలేదనే ఆరోపణలున్నాయి. దీంతో గ్రీన్ ఫీల్డ్ స్టేడియం ప్రాంగణంలో నిర్మించిన ఇండోర్ స్టేడియంతోపాటు ఆటగాళ్లకు ఉపయోగపడేలా ఏర్పాటు చేసిన మైదానం కూడా నిరుపయోగంగా మారింది. అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రస్తుతం గ్రీన్ ఫీల్డ్ స్టేడియం ప్రాంగణంలో పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. చిన్నపాటి మరమ్మతులు చేపడితే తిరిగి ఈ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంని ఉపయోగంలోకి తేవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

విరిగిన గేటు.. పగిలిన అద్దాలు

ఖానాపూర్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంపై అధికారుల పర్యవేక్షణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. కోట్ల రూపాయల నిధులను వెచ్చించి నిర్మించిన ఈ స్టేడియంపై పర్యవేక్షణ లేకపోవడంతో కొంతమంది స్టేడియం గేట్లను విరగొట్టారు. అంతటితో ఆగకుండా ఇండోర్ గేమ్స్ ఆడుకునేందుకు వీలుగా నిర్మించిన భవనం చుట్టూ గల కిటికీ అద్దాలను సైతం ధ్వంసం చేశారు. రాత్రివేళలో ఈ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం మందుబాబులకు అడ్డాగా మారుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

సమాంతరంగా లేక నిరుపయోగంగా..

క్రీడాకారులు ఆటలు ఆడేందుకు వీలుగా గ్రీన్ ఫీల్డ్ స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన మైదానం నిరుపయోగంగా మారింది. అయితే ఇందుకు కారణం మైదానం సమాంతరంగా లేకపోవడంతో పాటు మైదానంలో పెద్దబండ రాళ్లు, పలుచోట్ల పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఎత్తు పల్లాలుగా ఉన్న మైదానంలో ఏదైనా ఆటలు ఆడడం గానీ, కానిస్టేబుల్, ఆర్మీ లాంటి ఉద్యోగాలకు ప్రయత్నిస్తున్న అభ్యర్థులు రన్నింగ్, జంపింగ్ లాంటి ఈవెంట్స్‌ని ప్రాక్టీస్ చేసేందుకు అనుకూలంగా లేదని చెబుతున్నారు. మైదానంలో ఉన్న బండరాళ్లను తొలగించి, జేసీబీ బ్లేట్ ట్రాక్టర్ సహాయంతో ఎత్తు పల్లాలుగా ఉన్న ప్రదేశాలను సమాంతరంగా మారిస్తే మైదానం ఉపయోగంలోకి వస్తుందని పలువురు యువత అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం కొంతమంది యువకులు మైదానంలో రన్నింగ్ ప్రాక్టీస్ చేసేందుకు చిన్నపాటి ట్రాక్‌ను ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఎత్తు పల్లాలు ఉండడంతో కాళ్లు పట్టేస్తున్నట్లు చెబుతున్నారు. మైదానం ఉపయోగకరంగా లేకపోవడంతో ఆర్మీ జవాను, పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న యువత డాంబర్ రోడ్డు పైనే సాధన చేయాల్సిన పరిస్థితి తలెత్తిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కాళ్ల నొప్పులు వచ్చి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని, గ్రీన్ ఫీల్డ్ స్టేడియం మైదానాన్ని ఉపయోగంలోకి తేస్తే తమతో పాటు క్రీడాకారులకు, మార్నింగ్ వాకర్స్‌కి ఉపయోగకరంగా ఉంటుందని వారు కోరుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.




పెవిలియన్ భవనం ఎదుట ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు



• స్టేడియం పెవిలియన్ భవనం ఎదుట ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు

గ్రీన్‌ఫీల్డ్ స్టేడియాన్ని ఉపయోగంలోకి తేవాలి

• రాపెల్లి దీపక్ రాజ్, ఖానాపూర్



ఇటీవల నిర్వహించిన ఆర్మీ రాత పరీక్షలో అర్హత సాధించి ఈవెంట్స్ కోసం ప్రిపేర్ అవుతున్నాను. గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో చిన్నపాటి ట్రాక్‌ను ఏర్పాటు చేసుకొని నిత్యం రన్నింగ్ సాధన చేస్తున్నాం. కానీ మైదానం ఎత్తు పల్లాలుగా ఉండడంతో ఇబ్బంది పడుతున్నాం. గ్రీన్ ఫీల్డ్ స్టేడియాన్ని సమాంతరంగా మార్చి ఉపయోగంలోకి తేవాలి.

మైదానం సరిగా లేక రోడ్డుపై సాధన చేయాల్సి వస్తోంది

• వట్టిమల్ల రవి, ఆర్మీ జీడీ అభ్యర్థి, ఖానాపూర్



ఆర్మీలో ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా నిత్యం సాధన చేస్తున్నాం. గ్రీన్ ఫీల్డ్ స్టేడియంలో అనుకూలమైన మైదానం ఉన్నప్పటికీ అది ఉపయోగకరంగా లేక రోడ్డుపై సాధన చేయాల్సి వస్తోంది. అధికారులు స్పందించి స్టేడియం ఉపయోగంలోకి తెస్తే ఆర్మీ, కానిస్టేబుల్, ఇతర రక్షణ రంగాల్లో ఉద్యోగం సాధించాలనుకునే అభ్యర్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.



• నిర్మల్-మంచిర్యాల రహదారిపై రన్నింగ్ చేస్తున్న యువకులు

భక్తి



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వెడ్మబొజ్జు

ఘనంగా శివ పంచాయతన, శివ మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన

• ఎమ్మెల్యే వెడ్మబొజ్జు ప్రత్యేక పూజలు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే


ఖానాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజూర గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ శివ మార్కండేయ ఆలయంలో శుక్రవారం శివ పంచాయతన శివ మార్కండేయ, నవగ్రహ, ధ్వజ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ఉదయం ఐదు గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు రాజశేఖర్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు కొనసాగాయి. ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్, కౌన్సిలర్ కిషోర్‌నాయక్ సహా పలువురు ప్రముఖులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందజేస్తామన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇక్కట్లు కలగకుండా శివ భక్త మార్కండేయ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు అన్ని ఏర్పాట్లు చేశారు.

andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 ၊ కనిష్ఠం 19.3





సీఎంఆర్ బియ్యం గోల్‌మాల్

» జిల్లాలో 107 కోట్ల విలువ గల బియ్యం పక్కదారి » అక్రమాలకు పాల్పడ్డ ఏడు రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు » అధికారుల తనిఖీల్లో వెల్లడైన అవకతవకలు » కేసుల మాఫీ కోసం రైస్‌మిల్లర్ల ఎత్తుగడలు » అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు

నిర్మల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 2022-2023 ఖరీఫ్, రబీసీజన్‌లకు సంబంధించిన సీఎంఆర్ ధాన్యం వ్యవహారంలో భారీ ఎత్తున గోల్‌మాల్ జరిగినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. మొత్తం ఏడు రైస్‌మిల్లులు రూ.107 కోట్ల విలువ గల ధాన్యాన్ని పక్కదోవ పట్టించి లబ్ధిపొందాయని అంటున్నారు. అయితే సంబంధిత అధికారులు గత కొద్దిరోజుల నుంచి రైస్‌మిల్లులపై వరుస తనిఖీలు చేసి ఈ అక్రమాల గుట్టును రట్టు చేశారు. అధికారుల తనిఖీల్లో ఏడు రైస్‌మిల్లులు దాదాపు రూ.107 కోట్లకు విలువైన ధాన్యాన్ని అక్రమంగా అమ్ముకున్నట్లు నిర్ధారణ అయ్యింది. స్టాక్ రికార్డుల ప్రకారం రైస్‌మిల్లుల్లో ఉండాల్సిన ధాన్యం కనిపించకపోవడంతో అధికారులు ఈ వ్యవహారంపై పూర్తిగా ఆరా తీశారు. దీంతో అక్రమాల గుట్టురట్టయ్యింది. రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి ఎప్పటికప్పుడు సీజన్‌లకు కేటాయించిన విధంగా ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అందించాల్సి ఉంది. అయితే రైస్‌మిల్లర్లు దీనికి విరుద్ధంగా వ్యవహరించి కొంత మంది కిందిస్థాయి అధికారులతో మిలాఖతయ్యారు. దీనికి అనుగుణంగా వారు 2022-2023 ఖరీఫ్, రబీ సీజన్‌లకు సంబంధించిన ధాన్యాన్ని వ్యూహాత్మకంగా పక్కదోవ పట్టించి కోట్ల రూపాయలను స్వాహా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం సీఎంఆర్ ధాన్యాన్ని చెల్లించేందుకు రైస్‌మిల్లర్లకు ఇప్పటికే పలుసార్లు గడువు విధించింది. ముఖ్యంగా 2022-2023 ఖరీఫ్, రబీసీజన్‌లకు సంబంధించిన గడువులను రైస్‌మిల్లర్లు పలుసార్లు దాటవేశారు. అధికారుల హెచ్చరికలను సైతం బేఖాతరు చేశారు. తమకే కేటాయించిన ధాన్యం నిల్వలు రైస్‌మిల్లుల్లో నిల్వ చేయాల్సి ఉన్నప్పటికి వారు వాటిని బహిరంగ మార్కెట్‌కు తరలించి సొమ్ములు కూడబెట్టినట్లు చెబుతున్నారు. మొత్తానికి రైస్‌మిల్లర్ల అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. ఇప్పటికే 17 మిల్లులు డిఫాల్టు మిల్లులుగా అధికారులు గుర్తించారు. అలాగే ప్రస్తుత సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ కోసం రైస్‌మిల్లులు బ్యాంకు గ్యారెంటీలను చెల్లించాల్సి ఉన్నప్పటికి ఏ ఒక్క రైస్‌మిల్లు యజమాని కూడా ఇప్పటి వరకు బ్యాంకు గ్యారెంటీని చెల్లించకపోవడంతో ధాన్యం తరలింపు ప్రక్రియ ఇంకా మొదలు కాలేదని అంటున్నారు.

జిల్లాలో ఏడు రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు

కాగా జిల్లాలోని ఏడు రైస్‌మిల్లులు సీఎంఆర్ ధాన్యాన్ని అక్రమంగా అమ్ముకున్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. భైంసా మండలం దేగాం గ్రామంలో ఉన్న రాజరాజేశ్వరి రా రైస్‌మిల్లు 5905 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు కేవలం 692 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే అందించారు. ఇక్కడ ధాన్యం నిల్వలు కనిపించకపోవడంతో అధికారులు విచారణ జరిపి క్రిమినల్ కేసుతో పాటు ఆర్ఆర్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. అలాగే సారంగాపూర్ మండలం బీరవెల్లి గ్రామంలో ఉన్న సాయికృప రా రైస్‌మిల్లు 2022-2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2845 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 912 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ఇచ్చి ఈ మిల్లు యాజమాన్యం చేతులు దులుపుకుంది. దీంతో అధికారులు ఈ రైస్‌మిల్లుపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేశారు. బాసర మండలంలోని అక్షర రెడ్డి రైస్‌మిల్లు 1305 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. అలాగే రబీ సీజన్‌కు సంబంధించి 5083 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 2800 యంటీఎస్‌ల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే అందించారు. అధికారులు ఈ మిల్లుపై కూడా కేసు నమోదు చేశారు. అలాగే లోకేశ్వరం మండలం జోహర్‌పూర్ గ్రామంలోని రాజరాజేశ్వర రైస్‌మిల్లులో 1672 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా కేవలం 858 యంటీఎస్‌ల బియ్యాన్ని మాత్రమే చెల్లించారు. ఈ మిల్లుపై కూడా అధికారులు కేసులు నమోదు చేశారు. సారంగాపూర్ మండలం చించోలి (బి)లో గల అన్నపూర్ణ అగ్రో ఇండస్ట్రీస్ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 625 మెట్రిక్ టన్నులు, రబీ సీజన్‌కు సంబంధించి 263 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉండగా ఈ మిల్లు కేవలం ఇప్పటి వరకు 57 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే చెల్లించాయి. ముథోల్ మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన జై శ్రీత ఇండస్ట్రీస్ రా రైస్ మిల్లు యాజమాన్యం 2022-2023 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 2812 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అలాగే రబీ సీజన్‌కు సంబంధించి 448 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వాల్సి ఉంది. ఇప్పటి వరకు కేవలం 1258 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని మాత్రమే ఇచ్చాయి. ఈ మిల్లులకు కేటాయించిన సీఎంఆర్ ధాన్యంలో కొంత మేరకే మిల్లింగ్ చేసి అధికారులకు అప్పజెప్పారు. మిగతా ధాన్యాన్ని పక్కదోవ పట్టించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ మిల్లు యజమానులపై అధికారులు క్రిమినల్ కేసులతో పాటు ఆర్ఆర్ యాక్ట్ కింద కూడా కేసులు నమోదు చేశారు.

బ్యాంకు గ్యారెంటీలపై గందరగోళం

ఇదిలా ఉండగా ప్రస్తుత సీజన్‌కు సంబంధించి సీఎంఆర్ ధాన్యాన్ని మిల్లింగ్ చేసేందుకు రైస్‌మిల్లు యాజమాన్యాలు బ్యాంకు గ్యారెంటీని ఇవ్వాలంటూ ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లాలో ఇప్పటికే 17 రైస్ మిల్లులు డిఫాల్టర్లుగా తేలాయి. అయితే మిగతా రైస్‌మిల్లులు బ్యాంకు గ్యారెంటీలను ఇవ్వాల్సి ఉన్నప్పటికి ఏ ఒక్క బ్యాంకు కూడా ఇప్పటి వరకు బ్యాంకు గ్యారెంటీలను ఇవ్వకుండా మొండికేస్తున్నాయి. దీని వెనక పెద్ద ఎత్తున మతలబు దాగి ఉందని అంటున్నారు. రైస్‌మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి ఈ తతంగాన్ని కొనసాగిస్తున్నారన్న విమర్శలున్నాయి. మొత్తం జిల్లాలో 76 రైస్‌మిల్లులకు గానూ 17 రైస్‌మిల్లులను డిఫాల్టర్లుగా నిర్ధారించారు. అయితే మిగతా రైస్‌మిల్లులు కూడా బ్యాంకు గ్యారెంటీల విషయంలో దోబూచులాట వైఖరిని అవలంబిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది. కాగా 2022-2023 ఖరీఫ్, రబీ సీజన్‌ను నుంచి మొదలుకొని ఇప్పటి వరకు జరిగిన సీఎంఆర్ ధాన్యం కేటాయింపులు, సీఎంఆర్ బియ్యం వ్యవహారంపై మరింత లోతుగా విచారణ జరిపితే పూర్తిస్థాయిలో అక్రమాలు వెలుగుచూస్తాయని అంటున్నారు.

ఏడు రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం

జిల్లా పౌర సరఫరాల శాఖ మేనేజర్ గోపాల్

జిల్లాలో ఇటీవల ముమ్మరంగా తనిఖీలు చేపట్టాం. జిల్లాలో ఏడు రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టగా సీఎంఆర్ కోసం కేటాయించిన ధాన్యం లేదు. ఏడు రైస్‌మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు ఆర్ఆర్ చట్టం కింద కేసులు నమోదు చేశాం.

ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మాధ్యమిక విద్యాధికారి



కళాశాలలో స్టడీ అవర్‌ను పరిశీలిస్తున్న డీఐఈవో

దిలావర్‌పూర్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థుల జాబ్ ఓరియంటేషన్ ప్రోగ్రాంను జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరుశురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏ అండ్ టీ ఒకేషనల్ కోర్సులో విద్యార్థులు నవంబరు, డిసెంబరు నెలలో జాబ్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా స్థానిక ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో, దక్కన్ గ్రామీణ బ్యాంక్‌లో క్షేత్రస్థాయిలో ఉండే పనులను నేర్చుకోవడానికి వెళ్లారు. అనంతరం కళాశాలలో గత కొంత కాలంగా అమలు చేస్తున్న స్టడీ అవర్‌ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వార్షిక పరీక్షల ఫీజును నవంబరు 26వ తేదీలోగా విద్యార్థులందరూ చెల్లించాలన్నారు. పబ్లిక్ పరీక్షల కోసం ఈ స్టడీ అవర్ సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. తల్లిదండ్రులకు, ప్రతి విద్యార్థి ముఖ్యమైన ప్రశ్నలకు నోట్స్ తయారు చేసుకోవాలని సూచించారు. జిల్లా మాధ్యమిక విద్యాధికారి వెంట కళాశాల ప్రిన్సిపాల్ పి. సుదర్శన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించండి

• భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి

కుబీర్, నవంబరు 11 : మండల కేంద్రం ముథోల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడను ఆనుకొని ప్రధాన మురికి కాలువపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 18 అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జేసీబీతో తొలగించేందుకు సిద్ధమైయ్యారు. కాగా తమకు 15 రోజుల టైం ఇవ్వాలని కోరారు. అయితే 15రోజుల్లో పూర్తిస్థాయిలో తొలగిస్తామని వ్రాతపూర్వకంగా వ్రాసి ఇవ్వండని చెప్పగా ఏ ఒక్కరు వ్రాసి ఇవ్వలేదు. నాలుగు రోజుల్లో తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్డీవోతో పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ ఇప్పటికే మీరు 15రోజుల క్రితం తొలగించాలని నోటీసులు అందజేశారు. అయిన తొలగించ లేదు ఇప్పుడు తొలగించడం ఆపి మరో 4 రోజులు టైం ఇవ్వడం ఏంటని మండిపడ్డారు. 4 రోజుల్లోగా తొలగించక పోతే గ్రామస్తులందరి ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో, అక్రమ నిర్మాణాల పక్కనే పశువుల పాకలు, రేకుల షెడ్‌లు వేస్తామని అన్నారు. నాలుగు రోజుల్లో తొలిగించేలా చర్యలు తీసుకుంటామని అధికారులలు అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్వో సోము, ఎంపీడీవో నవనీత్‌కుమార్, గిర్దావార్ నిర్మల, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్, గ్రామస్తులున్నారు.

బాసరలో భక్తులకు అన్న ప్రసాద వితరణ



బాసర, నవంబర్, 8 : (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్ర నాందేడ్ జిల్లా ధర్మాబాద్ తాలుకా, జారికోట్ గ్రామానికి చెందిన మహబలేశ్వర్, సదానంద్, నందీశ్వర్ అనే భక్తులు శుక్రవారం బాసర అమ్మవారి దర్శ నానికి వచ్చిన భక్తులకు అన్న ప్రసాదవితరణ నిర్వహించారు. దేవస్థాన అన్నదాన సత్రంలో ఒకరోజుకు కావాల్సిన సరుకులన్నింటిని సమకూర్చి ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు


వరకట్నం వేధింపులకు వివాహిత ఆత్మహత్య



దస్తురాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అత్తింటి వరకట్నం వేధింపులకు సందలత(23) అనే వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై శంకర్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రేవోజిపేట్ గ్రామానికి చెందిన నాగరాజ్‌తో మూడు సంవత్సరాల క్రితం వివాహం అయ్యింది. వీరికి 15 నెలల కుమారుడు ఉన్నాడు. ఈ క్రమంలో భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం కొన్ని రోజులుగా వేధిస్తున్నారు. దీంతో మనస్తాపం చెందిన లత తన ఇంటి బాత్రూమ్‌లో చున్నితో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

విద్యార్థులకు విషయ పరిజ్ఞానం ఉంటేనే సత్ఫలితాలు


విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జేడీ సత్యనారాయణ

లోకేశ్వరం రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు అన్ని సబ్జెక్టు లపై పూర్తిస్థాయిలో విషయ పరిజ్ఞానం ఉంటేనే సత్ఫలితాలు వస్తాయని విద్యాశాఖ ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం లోకేశ్వరం మండలంలోని మన్మద్ ఉన్నత పాఠశాలతో పాటు రాజూర ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అలాగే పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించి నాస్ పరీక్షల వివరాల గురించి విద్యార్థులను ప్రశ్నించారు. అలాగే మన్మద్ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఫిజిక్స్ సబ్జెక్టులపై విద్యార్థులను ప్రశ్నించారు. అనంతరం కిచెన్‌గార్డెన్ సందర్శించి నిర్వహణ తీరుపై ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మల్కాగౌడ్, రాజేశ్వర్, ఉపాధ్యాయులు గంగాధర్, దేవేందర్, రాజేందర్, రమాదేవి, సౌజన్య, గోదావరి తదితరులు పాల్గొన్నారు.

కుంటాల సరిహద్దులో మళ్లీ పులి సంచారం



పులి పాదముద్రలను సేకరిస్తున్న అటవీశాఖ అధికారులు

కుంటాల, నవంబర్, 8 : (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలో శుక్రవారం మళ్లీపులి సంచరించింది. దీంతో గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు. నాలుగు రోజుల క్రితం సూర్యాపూర్, మెదన్‌పూర్, అంబుగాం గ్రామాల సరిహద్దులో సంచరించిన పులి మహారాష్ట్ర సరిహద్దుకు వెళ్లిపోయిందనుకున్న సమయంలో ఉదయం అంబుగాం ప్రాంతంలోని కుంటాల సమీపంలో పులి సంచరించినట్లు గ్రామానికి చెందిన విజయ్ అనే వ్యక్తికి ఉదయం నడకకు వెళ్లిన సమయంలో కనిపించినట్లు, ఉదయం 8 గంటల సమయంలో హనుమాన్‌నగర్ తాండాకు చెందిన 10 గ్రామస్తులు పులిని చూసి భయభ్రాంతులకు గురైనట్లు పేర్కొన్నారు. గత వారం రోజుల నుంచి పులి కుంటాల మండలంలోనే సంచరిస్తుండడంతో మండల ప్రజలు వ్యవసాయ పనులకు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం డీఆర్‌వోలు రేష్మ, రాజశేఖర్, ఎఫ్ఎస్ఓలు పూర్ణిమ, కీర్తిరెడ్డి, ఎఫ్‌బీవోలు హరిలత, రాజాసింగ్, ముస్తాక్‌లు ఘటనస్థలానికి చేరుకొని పులి పాదముద్రలను సేకరించారు.

నిషేధిత మత్తు పదార్థాలను సంపూర్ణంగా నిర్మూలించాలి

కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిషేధిత మత్తు పదార్థాలను సంపూర్ణంగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిలతో కలిసి ఆమె మత్తు పదార్థాల నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో గంజాయి సహా నిషేధిత మత్తు పదార్థాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. యువత మత్తు పదార్థాల బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయిని సాగు చేసినా, విక్రయించినా, రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మత్తు పదార్థాలను వినియోగించిన వారిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విస్తృత ప్రచారం కల్పించాలని, పోలీసు, ఎక్సైజ్‌శాఖ అధికారులు సమన్వయంతో ప్రత్యేక బృందాల ద్వారా తనిఖీ చేసి మత్తు పదార్థాలను నియంత్రించాలని సూచించారు. అంతర్రాష్ట్ర సరిహద్దులలోని చెక్‌పోస్టుల వద్ద నిరంతరం నిఘా నిర్వహించాలన్నారు. మత్తు పదార్థాల వినియోగం గురించి తెలిస్తే వెంటనే జిల్లా పోలీస్ నెంబర్ 8712671111కు తెలియజేయాలని, అలాగే టోల్ ఫ్రీ 1908 నెంబర్‌ను సంప్రదించాలని, తద్వారా మత్తు పదార్థాల బారి నుంచి రక్షించవచ్చునన్నారు. మత్తు పదార్థాలకు బానిసైన వారిని విముక్తి కేంద్రంలో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. విద్యా, పోలీసు, ఎక్సైజ్ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లాలోని విద్యాసంస్థల్లో మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంట పొలాల్లో గంజాయి సాగు చేసినట్లు తెలిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందజేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలనకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మత్తు పదార్థాల వినియోగంపై సమాచారం ఉన్నట్లయితే వెంటనే పోలీసు వారికి తెలియజేయాలన్నారు. మండలాల వారీగా ఇప్పటి వరకు నమోదైన గంజాయి, ఇతర మత్తు పదార్థాల గురించి వివరించారు. మత్తు పదార్థాలను వినియోగించిన, ప్రోత్సహించిన కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రతి బుధవారం గ్రామాల్లో కళాకారుల ద్వారా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, జిల్లా ఎక్సైజ్ అధికారి రజాక్, డీఎస్పీ గంగారెడ్డి, డీఎంహెచ్‌వో రాజేందర్, ఎస్సీ అధికారి రాజేశ్వర్‌గౌడ్, పోలీసు, ఎక్సైజ్ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేటి రేపు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై అవగాహన

నిర్మల్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఓటర్ల జాబితా 2025 ప్రత్యేక సవరణలో భాగంగా ఈ నెల 9 శనివారం, ఆదివారం ప్రత్యేక అవగాహన చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. 1 జనవరి 2025 నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్లు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకునేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు ఈ కార్యక్రమం నిర్వహిస్తార న్నారు. కొత్త ఓటర్లతో పాటు మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశాలున్నాయన్నారు. తుది జాబితా 6 జనవరి 2025న వెలువడనున్నట్లు తెలిపారు. బీఎల్‌వోలు శనివారం ఉదయం 10 గంటల వరకు తమ పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు.

ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తా : ఏలేటి



కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటి

సారంగాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చే వరకు నిలదీస్తానని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతు వేదికలో షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి రాగానే ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తన సొంత పనులకే పరిమితమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి రూ. లక్షతో పాటు తులం బంగారాన్ని అందిస్తానని ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. దీంతో పాటు నిరుపేద మహిళలకు రూ. 2,500ల ఫించన్ ఇవ్వకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఈ హామీలన్నీ నెరవేర్చే వరకు అసెంబ్లీలో ప్రభుత్వంతో పోరాటం చేసి హామీలన్నీ ప్రజలకు అందేలా చేస్తానని పేర్కొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభం...

మండల కేంద్రంలో గల ఓ ప్రైవేట్ పత్తి జిన్నింగ్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. దీంతో పాటు కౌట్ల(బి) నుండి అడెల్లి తండా రోడ్డు నిర్మాణం పనులకు భూమి పూజ చేశారు. అనంతరం ఓ పెళ్లి కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంశంకర్ రెడ్డి, కరిపే విలాస్, చంద్రప్రకాష్ గౌడ్, శ్రావణ్, వడ్డీ రాజేందర్‌రెడ్డి, సాహెబ్‌రావు, చిన్నరాజేశ్వర్, తిరుమలచారి, వీరయ్య, భూమారెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, నాయకులు, మహిళలు, రైతులు ఉన్నారు.

ఘనంగా సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠాపన



కుంటాల సృజనా విద్యానిలయంలో విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమం

కుంటాల, నవంబర్, 8 : (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం కుంటాల స్థానిక సృజనా విద్యానిలయంలో శుక్రవారం సరస్వతి దేవి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సృజనా విద్యానిలయం పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో చేపట్టిన ఇట్టి కార్యక్రమానికి వేద పండితులు రామచంద్ర రామానుజ జీయర్ వేద పండితులు (భీమవరం) అర్చకుల బృందం పాల్గొని సంకల్పం, విగ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ఠ, పూర్ణాహుతి, జలాధివాసము, మంగళ హారతి, తదితర ప్రత్యేకపూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొత్తకాపు గంగన్న, ప్రముఖ వైద్యులు రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోకు ఇన్‌చార్జ్ డీఆర్‌వో బాధ్యతలు



నిర్మల్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ ఆర్డీవో రత్నకుమారి శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పని చేసిన భుజంగరావు బదిలీపై వెళ్లారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విశ్వనాథ్‌పేట్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేతస్తున్నామని అధికారులు తెలిపారు. వ్యవసాయ మార్కెట్, మోచిగల్లీ, బుధవార్‌పేట్, గాంధీచౌక్, ఖజుతరుకమాన్, నాయుడివాడ, బోయవాడ, రామారావ్ బాగ్, సాయిబాబా ఆలయం, విశ్వనాథ్‌పేట్, వైఎస్ఆర్ కాలనీ, గాజులపేట్, డాక్టర్‌లైన్ ప్రాంతాల్లో సరఫరా ఉదయం 9 నుండి 11 గంటల వరకు నిలిచిపోనుందన్నారు.

ఆదర్శనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

నిర్మల్ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శనగర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శనివారం మరమ్మతు పనులు నిర్వహిస్తున్నందున ఉదయం 9 నుండి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివస్తున్నామని అధికారులు తెలిపారు. ఆదర్శనగర్, రాంనగర్, గాయత్రిపురం, ఆస్రా కాలనీ, ఈద్గామ్, భాగ్యనగర్, చేపల మార్కెట్, సిద్దాపూర్, ఇందిరమ్మ కాలనీ, సోఫీనగర్ ప్రాంత వాసులకు అసౌకర్యం కలుగుతుందన్నారు.

మేడిపల్లి సబ్ స్టేషన్ పరిధిలో..

మేడిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9:30 నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిచిపోనున్నట్లు అధి కారులు తెలిపారు. మేడిపల్లి, నీలాయిపేట్, కిషన్ రావుపేట్, పులిమడుగు గ్రామాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

పార్డి(బి) సబ్‌స్టేషన్ పరిధిలో ..

కుబీర్, నవంబరు 11 : మండలంలోని పార్డి(బి) సబ్‌స్టేషన్ పరిధిలో గల గ్రామాల్లో శనివారం కరెంటు సరఫరా నిలిచి పోతుందని ఏఈ ఆదిత్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు సాంకేతిక కారణాల దృష్ట్యా మరమ్మతులు నిర్వహించేందుకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలన్నారు.

ఖానాపూర్ పరిధిలోని పలు గ్రామాలకు..

ఖానాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : నేడు మండలంలోని పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఖానాపూర్ విద్యుత్ శాఖ ఏఈ రామ్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 33/11 కేవీ ఖానాపూర్ సబ్‌స్టేషన్‌తో పాటు సుర్జాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 వరకు మండలంలోని ఖానాపూర్, ఎగ్బాల్‌పూర్, మస్కాపూర్, సుర్జాపూర్, బాదనకుర్తి, సదర్‌మాట్, వెంకటాపూర్, మేడంపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. మరమ్మతు పనుల నేపథ్యంలో కలుగుతున్న అంతరాయానికి ప్రజలు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

సోన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన గుర్రం గంగన్న, కొత్తగొల్ల మల్లవ్వ ఇటీవల మృతి చెందారు. బాధిత కుటుంబాలను వేరువేరుగా ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, భాజపా నాయకుడు వి. సత్యనారాయణ గౌడ్ పరామర్శించారు.